క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

కొడకండ్ల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే వందేమాతరం ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ పూర్వపు జోనల్ ఇన్‌చార్జ్ మోడపల్లి సోమన్న అన్నారు. సోమవారం ఏడునూతుల, కొడకండ్ల ప్రైమరీ స్కూళ్లలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు చేయించిన పలకలను విద్యార్థులకు అందించి అక్షరాభ్యాసం చేయించారు. హెచ్‌ఎంలు ప్రవీణ్‌కుమార్, దోర్నం ప్రభాకర్‌లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చిల్పూరు: లింగంపల్లి గ్రామానికి చెందిన గడ్డం కనుకయ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 1,40,00 చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఏడునూరి రవీందర్ సోమవారం అందజేశారు. కనుకయ్య తుంటి విరిగి అనారోగ్యానికి గురి కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. పేద కుటుంబం కావడంతో విషయాన్ని రవీందర్.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేయించి అందజేశారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: పడమటికేశ్వాపూర్ గ్రామంలో గిద్దెల గణేశ్ మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగిటి విద్యానాథ్ పరామర్శించి రూ. 5వేల సాయం సోమవారం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గిద్దెల రమేశ్, సంతోష్‌రెడ్డి, నర్సింహయాదవ్, భాస్కర్, సంతోశ్, కర్ణాకర్ ఉన్నారు.

పోచన్నపేటలో..

మండలంలోని పోచన్నపేట గ్రామంలో మృతి చెందిన ధర్మాజీ నరేశ్‌చారి కుటుంబ సభ్యులకు సామాజిక సేవాకర్త పోతుల రాములుయాదవ్ రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. బాబు, రామచంద్రం, శివరాములు, సత్యనారాయణ పాపయ్య తదితరులు ఉన్నారు.

‘తహసీల్’లో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం



నర్మెట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ సేవాకేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎం. మహిపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు, నూతన ఆధార్ కార్డులు తదితర సేవలు అందించబడతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీటీ శంకర్, సీనియర్ అసిస్టెంట్ యాదయ్య, ఆర్‌ఐ సాయిబాబు, జేపీ స్వప్న, రాజశేఖర్, ఉపేంద్ర, కవిత, రేణుక, రంజిత్, గణేష్ పాల్గొన్నారు.

హర్షణీయం

బచ్చన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంట రుణాల మాఫీకి మార్గదర్శకాలు విడుదల చేయడం హర్షణీయమని ఆపార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి ప్రతి రైతుకు రూ. 2లక్షల మాఫీ అవుతుందన్నారు. అలాగే రైతు భరోసాపై కూడా అభిప్రాయాలను సేకరించి 10 ఎకరాల వరకు సాగు భూమికి సాయం అందించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజల సంక్షేమార్థం సీఎం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తారని తెలిపారు.

‘జంగా’ను కలిసిన నాయకులు

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని మండల యువజన కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేసే యువతకు ఉజ్వల భవిష్యత్ అనివార్యమన్నారు. కిష్టయ్య, యాకస్వామి, ఎల్లప్ప, సోమన్న, సంతోష్ ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

జనగామ రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలినీయం ఆధ్వర్యంలో క్లబ్ మాజీ చైర్మన్ ఎలికట్టె నరేందర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని స్థానిక రేల్వేస్టేషన్ వద్ద గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. వేనుగోపాల్ రెడ్డి, బండ భిక్షపతి, శ్రీరాం శ్రీనివాస్, దాసరి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



తరిగొప్పుల: మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలబాలికల పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు మండల నోడల్ అధికారి జానకి ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ విడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సునీత, ఉపాధ్యాయులు రవీందర్,గాదె జోసఫ్ బేబి, చిరంజీవులు, యూసఫ్ పాషా, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు



బచ్చన్నపేట: చిన్నారులతో అంగన్‌వాడీలు



జనగామ రూరల్: గానుగుపహాడ్‌లో..



ఊరూరా అంగన్‌వాడీల ర్యాలీ

జిల్లా వ్యాప్తంగా సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ‘అమ్మమాట–అంగన్‌వాడీ బాట’ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లోని చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలంటూ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దేవరుప్పులలో..



చిల్పూరులో..



జఫర్‌గఢ్‌లో..



జనగామ రూరల్: బెగ్గర్స్ కాలనీలో..



లింగాలఘణపురం: చీటూరులో..



తరిగొప్పుల: ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీలు



నర్మెటలో..

ఘనంగా సుశ్రుతుడి జయంతి

జనగామ: ప్రపంచానికి ప్లాస్టిక్ సర్జరీ పరిచయం చేసిన తొలి శస్త్రచికిత్స ఆయుర్వేద పితా మహుడు సుశ్రుతుడు అని వేద ఆయుర్వేదిక్ పంచకర్మ, వెల్‌నెస్ ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డి అన్నారు. సోమవారం సుశ్రుతుడి జయంతి పురస్కరించుకుని ఆస్పత్రిలోని 50 మంది పేషెంట్లకు పండ్లు, గొడుగులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఆయన చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాలు వేసి పూజించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య ప్రపంచం నేడు సుశ్రుతుడిని ప్లాస్టిక్ సర్జరీ రూపకర్తగా పిలుస్తారన్నారు. ఆయుర్వేద శాస్త్రంలో శల్యతంత్రం(సర్జరీ)కి ఆయన రచించిన సుశ్రుత సంహిత గ్రంథం ప్రామాణిక పాఠ్యగ్రంథంగా వాడుకలో ఉందన్నారు. మానవుడికి శస్త్రచికిత్స చేసిన తర్వాత, నొప్పిని తగ్గించేందుకు ఆల్కహాల్(పెయిన్ కిల్లర్)ను గుర్తించిన మొట్టమొదటి వ్యక్తి సుశుత్రుడే అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అంజిరెడ్డి

గ్రామాల్లో పీరీల ఊరేగింపు

నర్మెట: మొహర్రంను పురస్కరించుకుని ఆయాగ్రామాల్లో డప్పు వాయిద్యాల కేరింతలతో కులమతాలకు అతీతంగా యువత పీరీలను ఊరేగిస్తున్నారు. యుద్ధంలో మరణించిన హసన్, హుస్సేన్‌ల జ్ఞాపకార్థం కర్రల దట్టీతో తయారుచేసి ప్రతిష్ఠించిన పీరీలకు నిత్యం ఊదు సాంబ్రాణిలతో పొగవేస్తూ చేస్తున్న ఊరేగింపునకు మహిళలు నీటిబిందెలతో స్వాగతంపలికి నీళ్లు పోస్తున్నారు. బెల్లం, కుడుకలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటూ రాత్రివేళలో ఏర్పాటు చేసిన ఆల్వావద్ద ప్రజలు నృత్యాలు నిర్వహించి అస్సైదులా పాటలతో సందడి చేస్తున్నారు. కార్యక్రమంలో బొడ్డు సుధాకర్, కార్తీక్, నిమ్మకంటి రఘుపతి, రాజు, కృష్ణ, నరేందర్, శ్రీను, కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పీరీల ఊరేంగింపు

ప్రమాణ స్వీకారానికి హాజరైన నాయకులు



బచ్చన్నపేట: మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని అన్వేష్‌రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం శాలువా కప్పి, పూల బొకేను అందించి ఘనంగా సన్మానించారు. కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ జంగిటి నరేశ్ ఉన్నారు.

పిల్లలను బడిలో చేర్పించిన అధికారులు

జనగామ రూరల్: డివిజన్ పరిధిలో ఉపాధి కోసం వచ్చి పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల పిల్లను గుర్తించి అధికారులు పాఠశాలలో చేర్పించారు. అధికారులు జనగామ మెడికల్ కళాశాలలో ఆపరేషన్ ముష్కాన్‌లో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్, ఛతీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కుటుంబాలకు చెందిన ఏడుగురు పిల్లలను గుర్తించారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సమీపంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్‌ఎం శంకర్‌రెడ్డి, నోడల్ అధికారి రాజేందర్ పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, స్టేషనరీ అందజేశారు. ఈ ఆపరేషన్‌లో జనగామ ఎస్సై తిరుపతి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కుమారస్వామి, బాలాజీ, అలీ, శ్రీనివాస్, ప్రణయ్, రంజిత కుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందేలా చూడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన నాయకులు

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత, ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. మధ్యాహ్న భోజనంలో రాళ్లు, పురుగులు ఉంటుండంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నందున పరిశీలించి చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ అంజయ్యకు వినతి పత్రం సమర్పించారు. అలాగే బాలుర హాస్టల్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులను జాయిన్ చేసుకొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఉన్నత పాఠశాలలో అవసరమైన ఉపాధ్యాయులు, వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ఉపాధ్యాయుల నియామకంతో పాటు వసతులు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏబీవీపీ నాయకులు సున్నపోజు విశ్వాస్, ఉత్తేజ్, రాహుల్, స్వామి, సాయి, రంజిత్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం మండల కేంద్రంలోని పాఠశాలలను సోమవారం ఏక కాలంలో ప్రార్థనా సమయాన్ని సందర్శించారు ఎంఎన్‌ఓ కొమురయ్య. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశానుసారం ఏక కాలంలో స్టేషన్‌ఘన్‌పూర్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రార్థనా సమయానికి హాజరై తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈసమయంలో కొంత మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించక పోవడం, సీఎల్, రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించక పోవడం లాంటివి గమనించామని, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుక వెళ్తామన్నారు. ఇక నుంచి ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్, ఎంఐఎస్ సునీత, సీఓ గిరి, సీఆర్పీలు వెంకటేశ్వర్లు, లవన్‌కుమార్, జ్యోతి, శ్రీలత పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న ఎంఎన్‌ఓ కొమురయ్య

డ్రగ్స్ తీసుకున్నా.. విక్రయించినా శిక్షలు తప్పవు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎవరైనా సరె డ్రగ్స్ తీసుకున్నా.. విక్రయించినా, నిల్వ ఉంచుకున్నా శిక్షలు తప్పవని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ అన్నారు. మండలంలోని శివునిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సీపీ ఆదేశాల మేరకు డ్రగ్స్ వలన కలిగే దుష్పరిమాణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం యువత డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, ఇలా వాడుతూ దొరికితే జీవితంలో ప్రభుత్వ ఉద్యోగానికి పనికి రాకుండా అవుతారన్నారని, అందుకు డ్రగ్స్ వాడి జీవితాలను నాషనం చేసుకోవద్దని సూచించారు. సీఐ రాజు, ఎస్సైలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ భీంశర్మ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రఘునాథపల్లి: విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సోమవారం మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై ప్రిన్సిపాల్ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు సేవించడం ద్వారా అనారోగ్య సమస్యలతో పాటు విలువైన జీవితం అంధకారం కానుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఎస్సై దూదిమెట్ల నరేశ్ ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పాలకుర్తి టౌన్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ సీపీ ఆదేశాల మేరకు మండలంలోని గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను రక్షించండి

స్టేషన్‌ఘన్‌పూర్: తిరుమలనాథ స్వామి దేవాలయ భూములను రక్షించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. ఈమేరకు నల్లగొండ ఎండోమెంట్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్ మండల కేంద్రంలోని తిరుమలనాథ స్వామి దేవాలయ భూమి సర్వే నంబరు 641లో ఉన్న భూమిని కలకోట రంగాచారి అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న అతనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలిగించాలని లేదా టెండర్ పిలిచి వేలం నిర్వహించి అక్రమ నిర్మాణదారులకు సుంఖం విధించాలని కోరారు. త్వరలో చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేస్తామని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు.



ఎండోమెంట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు అందె వేణు, బజరంగదళ్ జిలా కోకన్వీనర్ అరవింద్, మాజీ చైర్మన్ కుంభం కుమారస్వామి హిందూ సంఘాల నాయకులు ముక్క స్వామి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట గిరి ప్రదక్షిణకు జనగామ భక్తులు



యాదగిరిగుట్టపై జనగామ భక్తులు

జనగామ: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో స్వామివారి స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సోమవారం జరిగిన గిరి ప్రదక్షిణకు జనగామ నుంచి భక్తులు తరలి వెళ్లారు. భక్తులు ధర్మపురి శ్రీనివాస్, జక్కుల వేణు మాధవ్, చింతకింది మల్లేశ్, రఘునాకూర్, సుంచు శ్రీకాంత్, పాండు, పులిగిల్ల శివ, అనంతుల ఆంజనేయులు, విజయ్‌కుమార్ గుప్త తదితరులు తెల్లవారు జాము 4 గంటలకు బయలుదేరారు. మెట్ల మార్గంలో స్వామిని దర్శించుకుని మూడు కిలో మీటర్ల మేర గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం మెట్ల మార్గం గుండా కాలినడకన కొండపైకి చేరుకుని లక్ష్మీనర్సింహ్మాస్వామిని దర్శించుకుని తిరిగి బయలు దేరారు. ప్రతీ నెల స్వాతి నక్షత్రం రోజు కొండచుట్టూ గిరి ప్రదక్షిణకు భక్తులు భారీ సంఖ్యలో తరలి రావాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కొడకండ్ల: రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వరంగల్ సీపీ ఆదేశానుసారం ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు వాహన పత్రాలు తప్పక కలిగి ఉండాలని, సత్ప్రవర్తనతో నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై కత్తి రమేష్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

‘ఇందిర’కు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కండ్లకోలు బాలరాజు అధిష్టానాన్ని కోరారు. మండలంలోని లింగంపల్లి గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండగా 10 ఏళ్ల పాటు ఇందిర కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేసిందన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా నియోజకవర్గాన్ని, కార్యకర్తలను వీడని ఆమెకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. పుట్ట రాజు, ఊమ్లా నాయక్, నారగోని రవి, తౌటి సునీల్, నల్ల ఎల్లయ్య, చింత ఎల్లయ్య, వెంకటయ్య, గాలి రాజు తదితరులు ఉన్నారు.

దారి ఇలా.. పాఠశాలకు వెళ్లేది ఎలా?

విద్యార్థులు, నాయకుల నిరసన

చిల్పూరు: దారి ఇలా ఉంటే తాము పాఠశాలకు ఎలా వెళ్లేదంటూ విద్యార్థులు సోమవారం నిరసన చేపట్టగా తల్లిదండ్రులు, నాయకులు సహకరించారు. మండలంలోని ఫత్తేపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు వెళ్లే రహదారిలో గ్రామంలోని మురుగు నీరు పాఠశాల సమీపంలో నిలుస్తోంది. చిరుజల్లులకే కుంటలా మారుతోంది. గతంలో గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే పాఠశాల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.





పాఠశాలకు వెళ్లే బురద దారి, ఇన్‌సెట్‌లో(నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు



గతంలో ఎన్నో సార్లు అధికారులకు విన్నవించాం. అయినా పట్టించుకోవడం లేదు. మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల అంటూ పనులు చేస్తున్నారే తప్ప పాఠశాలకు పిల్లలు వచ్చే రోడ్డు ఎందుకు పట్టించుకోరు. త్వరగా సమస్య తీర్చాలి.

– బానోత్ బాలరాజు, గ్రామస్తుడు

బురదలోనే నడుస్తున్నాం



ప్రతీ రోజు చెప్పులు చేతపట్టుకుని బురదలో నడిచి పాఠశాలకు వెళ్తున్నాం. మధ్యాహ్న భోజనం తినే సమయంలో వాసన భరించలేక పోతున్నాం. అధికారులు స్పందించాలి.

– హరిప్రసాద్, విద్యార్థి

ఒక్కోసారి బురదలో జారిపడుతున్నాం..



పుస్తకాల బ్యాగుతో నడిచి వస్తుంటే ఒక్కోసారి జారి బురదలో పడుతున్నాం. దీంతో తిరిగి ఇంటికి వెళ్తుంటే ఆ వాసన భరించలేక వాంతులు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. మా బడి వరకు రోడ్డు నిర్మించాలి.

– సాత్విక, విద్యార్థిని

ప్రమాదకరంగా కుళాయి గుంతలు..

జిల్లా కేంద్రం కుర్మవాడ ఏఎల్‌టీ ట్రాన్స్‌పోర్టు జంక్షన్‌లో కుళాయిల కనెక్షన్ల కోసం తీసిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాటిలో నీరు నిలిచి దగ్గరకు వచ్చే వరకు కూడా గొయ్యి ఉన్నట్లు కనిపించడం లేదు. దీంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా హెడ్‌పోస్టాఫీస్.. పురపాలికకు కూత వేటు దూరంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతను స్థానికులే శ్రమదానంతో పూడ్చుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

– జనగామ



కురుమవాడలో ప్రధాన రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గొయ్యి



హెడ్‌పోస్టాఫీస్ వద్ద గుంతను పూడ్చివేస్తున్న స్థానికులు

విజయవంతం చేయండి

దేవరుప్పుల: కోలుకొండలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) ఉదయం 9 గంటలకు తలపెట్టిన పల్లె బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, నియోజకవర్గ యువజన నాయకుడు దామెర అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి రానున్నందున పార్టీ గ్రామ, మండల, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.